సిల్కు చీర

[కథానిక]

= ‘రావు’ =

౧

ఆఫీసునుంచి అప్పుడే రావటం. కొళాయి దగ్గిర కాళ్లూ, చేతులూ, ముఖమూ కడుక్కుని, తాడుమీద వేసివున్న తువ్వాలు తీసి ముఖం అవీ తుడుచుకుంటూ గదిలోకి వెళ్లి యీజీఛైరులో కూలబడ్డాను. పగలల్లా పని చెయ్యడంచేత సాయంకాలం అయ్యే సరికి నాలాంటి గుమాస్తాలకి నడుంపడిపోయి కాళ్లులొటలొటలాడిపోవడం ఆశ్చర్యంకాదు. అందులోనూ ఈరోజు జీతాలరోజు! జీతం అందుకోవడం అంటే అందరికీ సంతోషమే. కాని అది పెద్ద జీతగాళ్లకి! నాలాంటి స్వల్ప జీతగాళ్లకి అది విచారకరమైన రోజే.

కుర్చీలోనైతే కూలబడ్డాను. కాని మనస్సుకి శాంతి యేదీ! ఈ చేతిలోపడ్డ నలభై అయిదు రూపాయలూ ఎవరెవరికి ఎలా సర్దుబాటు చెయ్యడమనేదే పెద్ద సమస్య! దాన్ని ‘సాల్వ్’ చెయ్యలేక కొట్టుకుపోతున్నాను.

“ఇది నీ దృష్టిలో స్వల్పజీతమా?” అని ప్రశ్నించేవారు ఉండవచ్చును. ఏపల్లెటూరులోనో అయితే ఈ డబ్బుతో జమీందారీ దర్జా వెలిగింపవచ్చు; ఏ చిన్న బస్తీలోనో అయితే పెద్దమనుష్యుల జీవనం జరపవచ్చు; కాని చెన్నపట్నంలాంటి గొప్పగొప్ప పట్నాల్లో యిది ఒక జీతంలో లెక్కకాదు; దీన్ని ఆధారం చేసుకుని సుఖంగా జీవనాన్ని గడపాలేము. గుమ్మం దిగాలంటే పర్సు జేబులో లేకుంటే యిక్కడ మనిషి దమ్మిడీకి మారడు.

ఇంటి అద్దె పన్నెండు రూపాయలూ పుట్టమీద పెట్టినట్టు వేరే వుంచవలసిందే! కిరాయికొట్టులో పద్దు పదిహేనుదాకా పెరిగి వుంది. బట్టలకొట్టుకి చెల్లించవలసిన పదింటికీ నాల్గురోజులక్రితమే బిల్లు చేరింది. పని మనిషికి రెండురూపాయిలూ దవ్వబిళ్లలాగ పడవెయ్యక తప్పదుగదా! నేతిసెట్టికి ఇవ్వవలసిన రూపాయిల లెక్క ఎదురుగా వున్న గోడమీద పదిహేను చుక్కలూ భూతంలాగ కనబడుతూ వున్నాయి. కేలండరులో దినదినమూ ఎక్కించే పాలవాడికి పదహారు పళ్లకి మించి వుంది. చాకలికి నాలుగు రేవులకి పైగా పొడకూలి యివ్వవలసి వుంది. నాకు గణేశ్ కాఫీపొడీ, మా ఆవిడకి నర్సాన్స్ టీ డబ్బు చెల్లిస్తేనే గాని రావు గదా! ఇంతకీ ఖర్చు లేనిది మంగలిని గురించి. ఎంచేతా? నేను “స్వయంమంగలిః” కాబట్టి.

యిక కథలోకి వద్దాం. ఈ స్వల్పజీతం ఎలా పంచడమనేది ఒక గొప్ప సమస్య ఔనంటారా కాదంటారా చెప్పండీ తగు మనుషులు! దేశనాయకులకు వుండే సమస్యలకంటే ఇదే గొప్ప సమస్యగా నాకు తోచదూ మరి!

నే నిలా ఆలోచిస్తూ వుండగానే "అదుగో నాన్నగారూ!" అంటూ పాపాయిని ఎత్తుకుని, నవ్వుముఖంతో వస్తూ, మా ఆవిడ రెండు చేతుల్నీ నా కందిస్తున్న పాపాయిని నావొళ్లో కూలవేసింది.

"ఏమి టలా ఆలోచిస్తున్నారు కోటన్నా తీయకుండా?"

"...................."

"ఓహో! ఈవాళ జీతాలు వచ్చే రోజు కదూ; కోటు బరువుగా వుంది కాబోలు తియ్యడానికన్నా వీలుకానంత!"

"అవును! జీతమంతా కానులుగానే యిస్తే రిక్షా చేయించుకునే రావలసి వుండును"

"అయితే ఆ బరువుమూటని జేబులోంచి యిలా పడవెయ్యండి: నాకూ వుపయోగపడుతుంది ఎల్లుండి దీపావళిఖర్చుకి; మీ కోటూ చులకనపడుతుంది"

నాకు వొళ్లు మండింది.

"ఇవ్వడానికి యేమీ అభ్యంతరం లేదు. నువ్వు దీపావళికి నీ యిష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకోవచ్చు-తీర్చవలసిన బాకీలన్నీ తీర్చి..."

"అలాగైతే బాకీలకే చాలదు! ఈమహా గొప్ప జీతమూ పుచ్చుకుని నేను నోర్లకునేదేమిటి?"

"అయితే ఏ బాకీ తీర్చకుండా నీకే యిచ్చివెయ్యమంటావా?"

"బాకీలు వచ్చేనెలైనా తీర్చుకోవచ్చు; పండుగు వచ్చేనెల రమ్మంటే వస్తుందా? చెప్పండి మీరే."

"........................"

"నా సలహా వినండి! అద్దె వచ్చేనెల సర్దుబాటు చేస్తా మని యింటావిడతో చెప్తాను. బట్టలవాడికీ ఆరీతినే కబురు చెయ్యండి. షాహుకారుకీ చాకలికీ సగంసగం యిచ్చి నోరు కట్టివెయ్యవచ్చు. నేతిసెట్టికి అందరూ యాభైలూ, అరవైలూ బాకీ వుండగా మనం పదిహేనేగదా బాకీవున్నది! వాడిని దబాయించి పంపెయ్యొచ్చు; అంతగా నిర్బంధిస్తే 'మరి నీ వాడిక అక్కర్లేదు' అని చెబితే వాడే నోరు మూసుకుని మారుమాట చెప్పక గమ్మని వెళతాడు. పాలదానికి నాలుగు రూపాయిలు చేతిలో పెట్టి పంపేసే పూచీ నాది. ఎటొచ్చీ పనిమనిషికి యివ్వక తప్పదు. దాని కిచ్చే రెండురూపాయిలూ వక లెక్కలోవి కావు. మిగతా ముప్ఫయి రూపాయిలూ పండుక్కి ఉపయోగించుకుందాం."

నా కీ సలహా యేమీ నచ్చలేదు. ముప్ఫయి రూపాయిలు వొక్క పండుగుకోసం ఖర్చుపెడితే జీవితం గడిపేది యెట్లా? ఇన్ని బాకీల బరువూ తలమీద పెట్టుకుని పండుగు చేసుకుంటేమాత్రం యేం సంతోషం? ఈబాకీలు వచ్చే నెలన్నా

తీర్చాలా వద్దా? అప్పుడుమాత్రం పైకం ఎక్కువగా ఎక్కడనించి వస్తుంది తీర్చడానికి? ఇంతకీ ముప్ఫయి రూపాయిలు - అంత పెద్ద మొత్తం ఒక్కరోజు కెందుకేమిటి?

నేనిలా ఆలోచించుకుంటూ వుంటే మా ఆవిడ తొందరపాటూ, ఆలోచన లేకపోవడం ... శరీరాన్ని మండింపజేశాయి. నేను కోపాన్ని దిగమింగి —

“ఆరేళ్లనుంచి కాపరం చేస్తున్నా నీకు ప్రపంచజ్ఞానం కొంచెమన్నా లేకపోవడం ఆశ్చర్యంగా వుంది. తగని పరుగులకి ఎప్పుడూ సిద్ధపడకూడదు. ఏమన్నా అంటే ‘ నీలకంఠాయ స్వాహా ! ’ చేస్తావు. నువ్వు యీ పండుక్కి ముప్ఫయి రూపాయిలు ఖర్చుపెట్టదలచడం మన తాహతుని ఆలోచించేనా ? ” అని కొంత రూక్ష స్వరంతోనే అడిగాను.

ఆమె ముఖం మూరెడు చేసుకుంది.

“ఏమో ముప్ఫయిరూపాయిలు, ముప్ఫయిరూపాయిలు అంటూ ముక్కుమీద వేలేసుగుంటూ మరీ ఏకరువు పెడుతున్నారు. చలివేంద్రలుపెట్టిస్తారా, సత్రాలకిస్తున్నారా? లేకపోతే మనిద్దరితిండికీ ఒకనాటికి ఈసొమ్ము కాజేస్తాననుకున్నారా ?... ఎప్పుడైనా ఒక విలువైనచీర తెమ్మని ఈ నోటితో అడిగేనా? ...పోనీగదా అని సంతోషంతో మీరన్నా తెచ్చారా? నోరు విడిచి యిప్పుడే నే అడుగుతూవుంట! ఓ యిరవై రూపాయిలకి మంచి బెంగుళూరు సిల్కుచీర తప్పక ఈపండుక్కి కొనిపెడితే మరి మిమ్మల్ని ఎప్పుడూ నిర్బంధించను. మీరో అయిదు రూపాయిలకి మంచి పంచెలచాపు కొనుక్కోండి. పాపాయికి ఒకటోరకం రెండు ఫ్రాకులు కొని తెండి. ఇదే నాకోరిక. ఒక విలువైన చీర లేకపోవడంచేత నాకు నలుగురిలోనూ నామోషీగా వుంది. మీరు ఈసారి ఎన్ని తిట్టినా వొప్పుకుంటాను. కాని ఈసారిమాత్రం నాకోరిక నెరవేర్చక తప్పదు.”

“లేకపోతే—”

“లేకపోతేనా ? పండుక్కి పుట్టింటికే వెళ్లిపోతాను. మా అమ్మగారింటికి వెళ్లడానికి నాకు పిలుపులు అవసరం లేదు. ఆడబొట్టె యింటికి వస్తే వాళ్లు ఆమాత్రపు చీర కొని యివ్వలేకపోరు; అంత లేనివాళ్లూ కారు! మీకూ ఈ బాధ తప్పిపోతుంది. ”

“...........”

“ అలా అని సంతోషించబోయేరు. నేను మళ్లీ యిక్కడికి రావాలంటే మీ చేత్తో నేనుచెప్పిన చీర కొని పట్టుకొచ్చిపిలుచుకు వస్తేనే కుదురుతుంది. లేకపోతే...”

“ అబ్బో! గొప్ప పట్టుదలే!”

“ అలాంటి పట్టుదల వుంటేనేగాని మీలాంటి మహానుభావులు దారికి వస్తారా ? ”

ఇంక ఈవిషయంలో ఎక్కువగా ప్రసంగించడం అనవసర మని తోచింది. ఏది ఎలాగ కానీండి, నేను చేయదలచుకున్నట్లు నేనున్నా చేసే తీరుతాను. అందుకోసం ముందస్తిగా నాఅభిప్రాయాన్ని వెలిబుచ్చడమూ, ఇప్పట్నుంచీ మనస్తాపాలు పెట్టుకోవడమూ ఎందుకూ ? మరో సంగతి. నేను సిల్కుచీర తేకపోతే ఆమె పుట్టింటికి వెళ్లిపోతుందట. అదీ ఒకందుకి మంచిదే. ఆవిడగారు రెన్నెల్లపాటు అక్కడ వుంటే

యిక్కడ అప్పులన్నా తీరుతాయి. యిరవై రూపాయిలతో నా కాలక్షేపమూ జరిగి పోతుంది. ఆమీద ఎలాగూ సిల్కు చీర కొనడానికి అవకాశం ఏర్పడనూ ఏర్పడుతుంది. తర్వాత ఆమె రానూవస్తుంది.

నేను అందుకున్నాను —

"ఇప్పుడు సిల్కు చీరా, అవీ తెస్తాననుకో. ఆమీదనన్నా అప్పులు ఎలా తీరుతాయి! ఈ నెల ఎలా జరుగుతుంది?"

"సంసారం వున్నంతవరకూ ఇవన్నీ మనని వెంటాడుతూనే వుంటాయి. సముద్రంలో అలలు లేకపోవడం యెప్పుడు? స్నానం చేసే దెప్పుడు? ఒకనాడన్నా దర్జాగా, సంతోషంగా గడపకపోతే ఈ జీవితం మరెందుకూ?"

"..................."

"నా వొక్కర్తెకోసమే చెప్పలేదు. నేను చక్కని సిల్కుచీర కట్టుకుని ముస్తాబైతే మీకుమాత్రం చూసి ఆనందించాలని వుండదేమిటి? మిమ్మల్ని సంతోషపెట్టడానికేగదా యీ వేషం అంతాను!"

"..................."

"ఏ రంగన్నా సరే-కలరు లైటుగా వుండాలి. బోర్డరు వెడల్పుగా వుండాలి. నల్లబోర్డరైతే మరీ మంచిది."

"..................."

"ఫాకులు మరిచిపోవద్దు...ఇదిగో! మీరు పంచెలు కొనుక్కోకపోతే ఒప్పుకోను. మీరూ కొనుక్కోడానికి సిద్ధపడితే నే నాకూ చీర కొనండి. లేకపోతే యేమీ వద్దు."

"..................."

"పొద్దున్నే యిడ్లీ, కాఫీ రెడీచేస్తాను. అవి తీసుకుని మరీ వెళ్లండి షాపుకి. నేను రానక్కర్లేదు. మీకు నచ్చితే నాకూ నచ్చినట్లే సెలెక్టుచెయ్యడంలో మీరు గట్టివారు!"

౨

రోజూ చూపించే మర్యాదకన్న ఎక్కువ మర్యాదతోనూ, ఎక్కువ ప్రేమతోనూ ఆమర్నాడు ఉదయం మా ఆవిడ కాఫీ ఫలహారాలు తయారుచేసి పెట్టి, షాపులు తిరగడానికి కొంత శక్తినీ, ప్రోత్సాహాన్నీ కలగజేసింది. పాపం! ఆమెఆప్యాయం చూసి నాకే నవ్వు వచ్చింది. ఈ ఉబలాటమంతా వృథాగదాఅనుకున్నాను. ఏమంటే, నేను ససేమిరామనుషుల్లో లెక్క. ఆమె పట్టుదలని మించిన మూర్ఖపుపట్టు నాది. అటు సూర్యుడు ఇటు వుదయించినా నేనీ దీపావళికి పది రూపాయిలకంటె ఒక్క దమ్మిడీ ఎక్కువ ఖర్చుపెట్టను. అదీ ఆమె ఏడుస్తుందనే కారణంచేతే గాని, వుత్సాహం చేతమాత్రం కాదు. నేను కొనదలచుకున్న వేమిటంటే—నాలుగో నాలుగున్నరో యిచ్చి వక చీరా, మూడున్నరకి ఓపంచెల చాపూ, ఒకటిన్నర రూపాయికి పాపాయి కో రెండు ఫ్రాకులున్నూ. నేనూ ఆలోచించాను. ఉదయాన్నే యివన్నీ తెస్తే అప్పట్నుంచే ప్రారంభమౌతుంది యుద్ధం! సాయంకాలమే ఊనుకి వెళ్లి తెస్తే రాత్రి భోజనాలయాక వాటిని ప్రదర్శింపవచ్చు. అంతవరకూ ఏ పేచీలూ లేకుండా సుఖంగా గడపనూ వచ్చు. ఇలా అనుకుని సాయంకాలమే ఊనుకి వెళ్లడానికి వీలు అవుతుందనీ, ఇప్పుడు తొందర

పనిమీద వెళ్లాలనీ చెప్పి మా ఆవిడను ఎలాగో ఒకలాగు ఒప్పించాను.

* * *

సాయంత్రం ఏడుదగ్గిరౌతుంది. చంకలో పార్సెలు పెట్టుకుని బ్రాడ్వే టర్నింగు దగ్గర నేను ట్రిప్లికేను ట్రాముకోసం ఎదురు చూస్తున్నాను.

ఇంతలో వెనకనుంచి వచ్చి నాభుజాన్ని తట్టుతూ, మా ఆఫీసులోనే పని చేస్తూ వున్న భూషణం "హలో రావ్! దీపావళీ పర్చేసెస్‌లాగున్నాయే!" అన్నాడు.

నేను వెనక్కి తిరిగి చూశాను. అతని చంకలోనూ వుంది వొక పార్సెలు. అతని భార్యా కూడా నా భార్యావంటిదే అయి వుండాలి అని అనుకున్నాను.

"ఏమి పర్చేసెసో లెద్దూ! అసలే స్వల్పజీతగాళ్లం! అందులోనూ ఈ 'వారు' నుంచి ప్రతీ వస్తువుకీ డబుల్ ది కాస్టు!..."

"ఎంత ఖర్చుపెట్టే వేమిటి?"

"ఏం ఖర్చుపెట్టగలం భాయ్! ఏదో అమాంబాపతులు పదిరూపాయలకి ఇటో అటో...నువ్వు చాలా ఖర్చు పెట్టా వనుకుంటాను."

"ఏదో నిన్ననే గదా జీతం అందుతా! యీదీపావళికి అది అంతా ఖర్చుకావా లని నా వుద్దేశం. ముప్ఫయి రూపాయిలూ ఖర్చు చేస్తే యీ చిన్న పార్సెలు వచ్చింది."

నేను నవ్వుతూ అందుకున్నాను—

"అవును! కొత్తకాపరంకూడాను నీది. విలువైనవి పట్టుకువెళ్లకపోతే ఇంట్లో మూతిముడుపులూ అవిన్నీ!"

"ఎందుకూ? అనుకుంటే పాపంకూడాను. మా ఆవిడకు ఎక్కువ ఖర్చు పెట్టడమంటే యిష్టం లేదు. ఈ పండుగ ఖర్చంతా పది రూపాయిలకి ఎంతమాత్రమూ మించకూడదని ఆమెఅభిప్రాయం."

"మరి యింతెందుకు ఖర్చుపెట్టేవ్రూ?"

"నాసంతోషంకొద్దీనీ. వాళ్లంటే అక్కరలేదంటారు గాని, మనం ఆలోచించొద్దూ? రాకరాక ఏడాది కొక్కసారి యిలాంటి పండుగ వస్తుంది. ఏం ఖర్చుపెట్టినా యిదే సమయం. ముందుకీ అంటే — ఏమో! అప్పు డెలా వుంటాయో పరిస్థితులు! ఎవరి కెవరో? అయితే సీకోసం దేహం ఉండొచ్చు-నెల ఎలా గడపడమనీ, అప్పు లెలా తీరుతా యనిన్నీ. ఈ విచారం మనకి యావజ్జీవమూ వున్నదే. మనిషిజన్మ ఎత్తినందుకు ఒకనాడన్నా ఆనందంగా వుండొద్దూ?"

ట్రాము వచ్చింది. ఇద్దరం ఎక్కి కూచున్నాం.

నా మనస్సు ఆలోచనలలో పడ్డది. క్లుప్తంగా ఖర్చుచేయించి, పొక్తుగా సంసారం నడుపుకునే ఉత్తమురాలు భార్యగా లభించినందుకు భూషణం గొప్ప అదృష్టవంతు డని చెప్పాలి. నాకు అలాంటి భార్య దొరికివుంటే ఎంత బాగుండునో అనిపించింది. నాభార్యచెడ్డతనాన్ని కొంత విమర్శించుకున్నాను. సిల్కుచీర తెమ్మనడంతప్ప మరేమీ ఆమెతప్పు కనబడలేదు. ఔను! అదీ తప్పు కాదు. ఏడాది కొక్కటే ఒక్క దీపావళి! మా ఆవిడా ఎప్పుడూ కోరనూ లేదు. నోరు విడిచి అడిగింది. కొనకపోవడం తప్పే ననిపించింది. భార్య కోరకపోయినా

కొన్నాడు భూషణం. కోరినా కొనలేక పోయాను నేను. ఆలోచిస్తే అతనికీ నాకూ భేదం వుంది. వాళ్లది కొత్తకాపరం. మాది కొంత పాతబడింది ; సంసారం మరో ప్రాణితో పెరిగిందికూడాను. అంచేత నేను చేసిందీ తప్పుకాదని సమాధానపడ్డాను.

ట్రాము ట్రిప్లికేను చేరింది. అల్యూమినియుం ఫాక్టరీదగ్గర అతను దిగిపోయాడు; పైక్రాఫ్ట్సురోడ్డుదగ్గర నేను దిగాను.

ఇంటికి వెళ్తున్నానే గాని, బలవంతాన్ని ఎవరో వెనకనుంచి నెట్టుతున్నట్లే నడుస్తున్నాను. ఇల్లు దగ్గిర అయినకొద్దీ దిగులు ఎక్కువ కాజొచ్చినది. ఇక ఎలాగూ కలతలూ, మనస్పర్థలూ తప్పవనుకున్నాను. ఇంతకీ ధైర్యంమాత్రం విడవలేదు.

3

గుమ్మంలో అడుగు పెట్టాను. నవ్వు ముఖంతో మాఆవిడ పాపాయిని ఎత్తుకుని ఎదురుగా వచ్చింది.

" మీకోసమే ఎదురుచూస్తున్నాను. ఎంతసేపటికీ రాలేదు మరీ. చీకటి! దానికి సాయం బ్లాకౌటూ చినుకులున్నూ! మనస్సు పరిపరివిధాల పోయి బెంగపెట్టుకున్నాను కూడాను."

"ట్రాము దొరక్క ఆలస్యం అయింది" —నేను కొళాయిదగ్గిర కాళ్లు కడుక్కుంటూ పార్సెలు ఆమెకు అందించాను.

"ఇప్పుడే విప్పకు. భోజనా లయాక చూసుకోవచ్చు."

''అలాగే లెండి. పాపాయి ఫ్రాకులకి ఎంత ఏడ్చిందనుకున్నారు, పక్కవారిపిల్లకి కొన్న కొత్త గౌనులు చూచి. పెట్టెలోంచి చాకింటిమడతలు తీసి యిచ్చినా పాతవంటూ వాటిని విసిరికొట్టింది."

"ఇదంతా పెద్దపాపాయి ఉబలాటం కాదూ సిల్కుచీరకి?"

"చాలు లెద్దురూ — మీ మాటలూ, మీరున్నూ" అంటూ ఆమె లోపలికి వెళ్లి పోయింది.

* * * *

నాభోజనం అయింది. మాఆవిడ అన్నానికి కూర్చుంది. పాపాయి కూటంలోని ఉయ్యాల్లో నిద్రపోతున్నది.

బట్టల పార్సెలు గదిలో టేబిలుమీద భద్రంగా వుంది.

నేను గదిలోకి వచ్చి మంచమ్మీద వెల్లకిలా పడుక్కొని ముందు జరగబోయే సన్నివేశాన్ని ఎదుర్కోడానికి సిద్ధంగా వున్నాను.

నాకు ఆలోచనలమీద ఆలోచనలు పోతున్నాయి.

"మా ఆవిడ ఇల్లంతాచక్కబొటు చేసుకునివచ్చిఆప్యాయంతో పార్సెలువిప్పుతుంది; నేను తెచ్చిన వస్తువులు చూసి మండిపడి, కొంచెం కూనిరాగం తీసి మూతిముడుచుకు పడుక్కుంటుంది. తెల్లవారినతర్వాత ప్రయాణం కట్టి పుట్టింటికి వెళ్లిపోతుంది, పండుగ రోజని అయినా ఆలోచించకుండా. నలుగురూ ముక్కుమీద వేలేసుకుంటారు. నాకు నలుగురిలోనూ నామర్దా......ఒంటరిగాడ్ని గనక యింత యిల్లు అవసరం ఉండదు. ఏలాడ్జిలోనో తక్కువ అద్దెకి వక గది తీసుకుంటాను. హోటల్లో భోజనం.

ఏ లాడ్జి అనుకూలంగా వుంటుంది? ఏ హోటల్లో టిక్కెట్లు కొనడం?"

ఇవే నా ఆలోచనలు!!

ఇలా అరగంట జరిగిపోయింది. మా ఆవిడ నైట్ డ్రస్సు పూర్తిచేసుకుని ఉయ్యాల్లో పడుక్కున్న పాపాయిని తీసుకు వచ్చి గదిలో చిన్నమంచంమీద పడుకోక్కోపెట్టి, వెచ్చగా బట్టకప్పింది. ఇదంతా క్రీగంటితో చూస్తూవున్న నేను నిద్ర నటించి కళ్లు మూసుకున్నాను, దడదడ కొట్టుకుంటున్న గుండెతో.

పార్సెలు కట్టు విప్పిన చప్పుడయింది. తర్వాత పొట్లం విప్పి బట్టలుతీసిన చప్పుడూ అయింది.

"చీర ఎంత బాగుందో! ఒకటో రకం! బోర్డరుకే యివ్వొచ్చు ఎంత డబ్బయినా. ఫ్రాకులు కళ్లు మిణిగిపోతున్నాయి! పంచెలు కూడా మంచి సెలెక్షనే" అనే మాటలు నాచెవిని పడ్డాయి.

ఆమె వేళాకోళానికి ప్రారంభించిందని అనుకున్నాను. ఇక వాగ్యుద్ధానికి ప్రారంభమేమో?

ఆమె మంచందగ్గిరికి వచ్చి నన్ను మెల్లగా తట్టింది.

"చూడండీ! అప్పుడే నిద్రా? మీరెంత మంచివారండీ! నే ననుకున్నవాటికంటె మంచిరకాలు తెచ్చారు, మొదట విసుక్కున్నా! మీకుమాత్రం అభిమానం లేదేమిటి నామీద? ఎంతో బాగున్నాయి!"

నిద్రనుంచి లేచినట్లు నటిస్తూ నేను చటుక్కున లేచి బట్టలవేపు చూశాను. చూసి ఆశ్చర్యపోయాను. అవి మా ఆవిడ చెప్పినట్లే చాలా ఆకర్షణీయంగా వున్నాయి.

ఎంతపని జరిగింది!!

అవి భూషణం కొన్నవికాబోలు పార్సెళ్లు తారుమారైనాయి!

మా ఆవిడముఖం చాలా వికసించి వుంది! అందులో ఒక కొత్తతళుకు ప్రకాశిస్తున్నది!

"ఏమిటలా దిగాలుపడి చూస్తున్నారు?" అంది ఆమె.

ఒక్కసారిగా నా మనస్సు కుంగిపోయింది. మా ఆవిడే గెలిచింది. నేనే ఓడిపోయాను. వున్న సంగతి చెప్పి ఆమెమనస్సు ఎప్పటికీ పాడుచెయ్యడం సరసమైన పనిగా తోచలేదు. ఆమెచేతిలో పడ్డ వస్తువులని 'మనవికా' వంటూ తీసుకోవడం పశుత్వాన్ని తెలుపుతుంది. తానొకటి తలిస్తే దైవ మొకటి తలచిన ట్లయింది. భూషణానికి మర్నాడు జరిగినదంతా చెప్పి వచ్చేనెల సర్దుబాటు చేస్తానని సమాధానపరచవచ్చు.

ఇలా అనుకుని మా గృహలక్ష్మిమాటకి సమాధానంగా వెంటనే జవాబిచ్చాను.

"మరేమీ లేదు. నా సెలెక్షను నీకు పూర్తిగా నచ్చిందో, లేదో అని ఆలోచిస్తున్నాను."

"ఏమి చమత్కారమండీ! వీట్లోనే కాదు, అన్నిట్లోనూ ఎంచడంలో మీరు చాలా గట్టివారని మిమ్మల్ని పెళ్లాడ్డానికి ముందునుంచి బాగా తెలుసుకున్నానుగా."

"..........."

"చీరా, పంచెలూ, ఫ్రాకులూ—అన్నీ ఒకదానికొకటి ఈడుతీయకుండా వున్నాయి."

"..........."

"చూడండీ! రేపు ఈ చీర కట్టుకుంటే నేనుఎంతో బాగా వుంటానుకదండీ!"

ఇలా అంటూ ఆమె నావైపు వాలింది. "ఇప్పుడుమాత్రం బాగా లేవా యేమిటి?" అంటూ ఆమెని దగ్గరకు లాక్కున్నాను.

౪

మర్నాడు — అంటే దీపావళినాడు చీకటితోనే లేచి భూషణంగారింటికివెళ్లాను.

"తమాషా జరిగిపోయిందోయి భూషణం! రాత్రి!"

"ఇంటికి వచ్చి చూసుకున్నాక తెలిసింది నాకున్నూ. పోనీ! దానికేం లే? మా ఆవిడ కోరినవే ఆమెకి వచ్చాయి. నాకేమీ విచారం లేదు. మీరే డిజపాయింటయి ఉండాలి."

"లే" దంటూ నవ్వుతూ నా సంగతంతా అతనికిచెప్పాను. అతను నాకు చాలా ఆప్తుడు. మరెవ్వరినోటా ఈ సంగతి వెయ్యడని నాకు గట్టి నమ్మకం కూడాను.

"సరే! మంచిపనే జరిగింది. ఇకనైనా బుద్ధి తెచ్చుకో! వాళ్ల మనస్సుని ఎప్పుడూ మనం కలతపెట్టకూడదు. ఒకవేళ మనం ఒకలాగ తలిచినా వాళ్లకోరికే నెగ్గిస్తాడనుకో భగవంతుడు!"

"వచ్చేనెల నీకు లెక్క సర్దుబాటు చేస్తాను, మన్నించు."

"దానికేం లేవోయ్. నీకు వీలయినప్పుడే యివ్వవచ్చు. నువ్వు మా కొక సేవింగ్సుబ్యాంకిలాంటివాడవు!"

"ఫ్రాకులు నీకు అనవసరంగదా! నాకిచ్చెయ్యి."

"అవి అప్పుడే మా టెనెంట్సు చిల్డ్రనుకి ప్రజెంటు అయిపోయాయి. వాళ్లు పూర్ పీపుల్! అందుకోసమనే సాదావి రెండు ఫ్రాకులు తెమ్మని మా ఆవిడ మొదటే చెప్పింది."

"ఏం దర్జా నీది! ధర్మానికి ఇచ్చేవి కూడా అంత ఖరీదువి తెచ్చావు!"

"బాబూ! నువ్వు నా పార్సెలు తీసుకోపోవడం మంచి ఉపకారం చేసినట్టు! అదే నేనింటికి తెచ్చినట్టాయనా—నా దూబరతనానికి నాకు గట్టిగా బహుమానాలు అంది వుండేవి! చచ్చినట్లు ఈవాళ మళ్లా షాపుకి-వాట్ని మార్చడానికి వెళ్లవలసీ వుండేది."

* * *

భూషణం నిర్బంధించినా వుండక, కాఫీ టిఫిన్లకి వేగంగా ఇంటికే చేరుకున్నాను. మా ఆవిడ నాకోసం కనిపెట్టుకుని కూచుంది.

అల్పాహారస్వీకరణం అయింది.

"మిమ్మల్ని నిర్బంధించి అన్నీ కొనిపించేనే గాని—రాత్రి నిద్దరలోకూడా ఇదే ఆలోచన—ఈనెల ఎవరెవరికి ఎలా సమాధానం చెప్పడమంటూనూ. ఇంటావిడ అద్దెకోసంకాబోలు రెండుసార్లు నావేపు చూసింది."

"నువ్వేమీ ఆలోచించ నక్కర్లేదు. మనం అందరికీ తగినట్లు సర్దుబాటు చెయ్యవచ్చు. నిన్నటిడబ్బులో పదిరూపాయిలే ఖర్చు పెట్టాను."

"మరి నిన్న తెచ్చినవి?"

"భూషణందగ్గిర పాతిక రూపాయలు చేబదులు తెచ్చాను, వీలున్నప్పుడు ఇస్తానని!"

[ఒక ఆంగ్లకథను మనసులో ఉంచుకొని]